గురుపూర్ణిమకు సాయి సంస్థాన్ ముస్తాబు

- విద్యుత్ వెలుగులతో విరాజిల్లుతున్న సంస్థాన్
- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

దిల్‌సుఖ్‌నగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ షిరిడీ సాయి సంస్థాన్ ఆదివారం నాటి గురుపూర్ణిమ వేడుకకు ముస్తాబైంది. రంగు, రంగుల పూలు, విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్యాంకుమార్, ప్రధాన కార్యదర్శి రఘకుమార్ వెల్లడించారు.



సాయి బాబా విగ్రహం

24గంటలు దర్శనం..

గురుపూర్ణిమ రోజు ఉదయం 6గంటల నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు అంటే 24గంటలు దర్శనానికి అనుమతివ్వనున్నారు. అర్ధరాత్రి సమయంలో కూడా సంస్థాన్ తెరిచే ఉంచనున్నట్లు వివరించారు. అదేవిధంగా ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సంస్థాన్ వెనుక వైపు వీధిలో, మెగా థియేటర్ వెనుక గేటు వద్ద నిరంతరాయంగా అన్నదానం నిర్వహించనున్నారు.



ముస్తాబైన అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ద్వారక షిరిడీ సాయిబాబా ఆలయం

ప్రత్యేక క్యూలైన్లు.. రెండు ఎల్ఈడీలు

బాబా దర్శనానికి వచ్చే చిన్నారులు, వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా దాతల కోసం ఓ క్యూలైన్, వీఐపీల కోసం మరో క్యూలైన్ ఇలా ఐదు రకాల క్యూలైన్‌ల ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. హారతి సమయంలో సంస్థాన్ లోపల ఉన్న భక్తులతో పాటు బయట ఉన్న వారు కూడా హారతి వీక్షించేందుకు వీలుగా సంస్థాన్ ప్రవేశ ద్వారం బయట ఒకటి, సంస్థాన్ ముఖద్వారం(ఆర్చ్) వద్ద ఒక ఎల్ఈడీని ఏర్పాటు చేశారు.

నేడు ద్వారక షిరిడీ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ద్వారక షిరిడీ ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కాశీనాథుని సత్యనారాయణశర్మ తెలిపారు. ఉదయం కాకడ హారతి, సామూహిక అభిషేకం, బాబా భజన సంకీర్తనతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

గురు పౌర్ణమి రోజు ఉచిత కంటి వైద్య శిబిరం

గురు పౌర్ణమి రోజు ఆలయ ప్రాంగణంలో నేత్రాలయ ఐకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అర్చకులు సత్యనారాయణశర్మ తెలిపారు. గుడికి వచ్చిన భక్తులందరు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మలక్‌పేట కళాశాలలో పర్యటిస్తున్న ఇంటర్ బోర్డు సెక్రటరీ శృతి ఓజా, ఎమ్మెల్యే బలాల

కళాశాలలో సౌకర్యాల కల్పనకు చర్యలు

- ఇంటర్ బోర్డు సెక్రటరీ శృతి ఓజా

సైదాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు సెక్రటరీ శృతి ఓజా తెలిపారు. శనివారం చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల, మలక్‌పేట ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలను విద్యాశాఖ అధికారులు, ఎమ్మెల్యే బలాలతో కలిసి సందర్శించారు. కొత్తగా నిర్మించిన చంచల్‌గూడ కళాశాలల భవనంలో వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. కలాడేరా, ఆజంపురా, చంచల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతుల గదుల కోసం స్థలం కేటాయించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. డీఈఓ రోహిణి, సైదాబాద్ మండల ఉపవిద్యాశాఖాధికారి రాధాకృష్ణ, కార్పొరేటర్ మినాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సబితారెడ్డి, కామేశ్‌రెడ్డి తదితరులు

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

సరూర్‌నగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డిపై బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు పెట్టిన అవిశ్వాసం వీగిపోయిన నేపథ్యంలో శనివారం బీఆర్ఎస్ మీర్‌పేట్‌శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డితో కలిసి మాజీమంత్రి కేటీఆర్‌ను కలిశారు. మీర్‌పేట్ గడ్డ బీఆర్ఎస్ అడ్డ అని, అక్కడ ఇతర పార్టీల పాచికలు పారబోవని ఈ సందర్భంగా సబితారెడ్డి పేర్కొన్నారు. అవిశ్వాసం నెగ్గేలా కృషి చేసిన సబితతో పాటు పార్టీ కార్పొరేటర్లను, నాయకులను కేటీఆర్ అభినందించారు. కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు సిద్దాల బీరప్ప, అంజయ్య, లక్ష్మణ్‌ముదిరాజ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



వరదనీటిని సమీక్షిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కురిసిన వర్షానికి మ్యాన్‌హోల్ పొంగి వరదనీరు రోడ్లపైకి వస్తుందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు తక్షణమే స్పందించిన కార్పొరేటర్ ఏఈ ప్రజ్ఞతో కలిసి అభ్యుదయనగర్, విజయవాడ జాతీయ రహదారి, చింతలకుంట, జాంగీర్‌నగర్ తదితర కాలనీల్లో నిలిచిపోయిన వరదనీరును సంబంధిత సిబ్బందితో తొలగించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలనీవాసులు అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని, లేనిచో ఇంటికే పరిమితం కావాలన్నారు. ప్రజలకు వరదనీరు, డ్రైనేజీలతో సమస్యలు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలనీవాసులు పవన్‌కుమార్‌గుప్తా, పీ.వీ.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

శివారును వీడని ముసురు..

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ముసురు కురుస్తోంది. శనివారం కూడా ముసురు యథావిధిగా కొనసాగింది. మంచులా కురుస్తున్న ముసురుతో రోడ్లపై వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చాలా మంది ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేదు. వరి నాట్ల సమయంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

వనస్థలిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. శనివారం వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో డ్రగ్స్ సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల ఏర్పడే ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. నేర రహిత సమాజం కోసం విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, అసంఘటిత కార్యక్రమాలకు పాల్పడే అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఏడుకొండలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవంలో బ్యాంక్ మేనేజర్ విజయలక్ష్మి, ఖాతాదారులు

చంపాపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని బ్యాంక్ ఆఫ్ బరోడా కర్మన్‌ఘాట్ బ్రాంచిలో శనివారం బ్యాంక్ 117వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బ్యాంక్ మేనేజర్ విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది కొక్కొండ సూర్యప్రకాష్‌గుప్తా, కొక్కొండ వైకుంఠంగుప్తా, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, సురేష్‌రెడ్డి, లావణ్య, అనిల్ పాల్గొన్నారు.



ఆలయంలో కొలువుతీరిన అమ్మవారు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సైదాబాద్ బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

- 28న బోనాల ఉత్సవం, 29న ఘటాల ఊరేగింపు

సైదాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): భాగ్యనగరం ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే మహాకాళి అమ్మవారి ఉత్సవాలు సైదాబాద్ ప్రాంతంలో ఈనెల 28న ప్రారంభం కానున్నాయి. శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే సైదాబాద్ బోనాల జాతరకు ఓ ప్రత్యేకత ఉన్నది. బోనాల ఉత్సవ సందర్భంగా 28న బోనాల ఉత్సవం, 29న మధ్యాహ్నం 1-30 గంటల నుంచి అమ్మవారి ఘటం ఊరేగింపు, గావుపెట్టె, పలహారబండ్ల ఊరేగింపు, 30న మధ్యాహ్నం జరిగే అన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అమ్మవారి ఘట్టాల ఊరేగింపులో పౌరాణిక వేషాలు ధరించి భక్తి భజన పాటలతో కనువిందు చేసే ఆర్కెస్ట్రా, పోతురాజుల వేషాలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు.

కమలానగర్ సీనియర్ సిటిజన్స్ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ కమలానగర్ సీనియర్ సిటిజన్స్ నూతన కమిటీని శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బీ.ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జీ.సారంగం, ఉపాధ్యక్షుడిగా డీ.గోవర్ధన్, సహాయ కార్యదర్శిగా ఎం.విఠల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డీ.అచ్చయ్య, కోశాధికారిగా ఏ.ఎస్ సత్యమూర్తిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు కృషి చేసిన సీనియర్ సిటిజన్స్‌కు నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న వెంకటేశ్‌గౌడ్

హయత్‌నగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జేఏసీ నాయకురాలు గోసుల అరుణయాదవ్‌కు శనివారం రియల్ ఎస్టేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేశ్‌గౌడ్ ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వానికి, క్రయవిక్రయ దారులకు మధ్య వర్తులుగా అసోసియేషన్ కృషి చేస్తుందని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బత్తిని అంజిగౌడ్, సీతారాం నాయక్, వెంకట్‌రెడ్డి, మహాలక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సతీష్‌కుమార్

హైదర్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్ ఎంఐజీ-870లో నివాసం ఉండే సతీష్‌కుమార్(33) ఐకాన్‌వేవ్‌లో నెట్‌వర్క్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి తన బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కాల్‌చేస్తే ఫోన్ అందుబాటులో లేదు అని సమాచారం వస్తోంది. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన వారిని, స్నేహితులను విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో సతీష్‌కుమార్ సోదరుడు ఉమేష్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



బంజారాకాలనీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బంజారా నాయకులు

హయత్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీని హర్షిస్తూ శనివారం హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారాకాలనీలో బంజారాలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేగావత్ గోవర్ధన్‌నాయక్ ఆధ్వర్యంలో పలువురు బంజారాలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల అనేక మంది బంజారా ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాలూనాయక్, వర్యానాయక్, దాసునాయక్, సీతారాంనాయక్, మకట్లాల్‌నాయక్, శ్రీరాములు, రవి, సంతోష్‌కుమార్, బుజ్జినాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

1 నుంచి దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్‌డే



మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం దివ్యాంగులకు చేయూత పేరుతో ఆగస్టు 1 నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని దివ్యాంగుల సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. శనివారం మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా శిశు, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి నెల ఒకటవ, మూడవ గురువారాల్లో గ్రీవెన్స్‌డే, రెండు, నాలుగవ గురువారాల్లో డయల్‌యువర్ చైర్మన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూదరుల ఆటకట్టించిన ఎస్‌వోటీ పోలీసులు

- దమ్మాయిగూడలో పేకాట ఆడుతున్న 11మందిపై కేసునమోదు
- రూ.1.50,575 నగదు. 2 కార్లు, 11 మొబైళ్లు స్వాధీనం

జవహర్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 11 మంది జూదరులను మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడలో చోటు చేసుకుంది. ఎస్‌వోటీ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌బాబు ఆధ్వర్యంలో పేకాటాస్థావరంపై దాడులు నిర్వహించారు. దమాయిగూడలోని సాయిప్రియాకాలనీలో ఉన్న ఓ నివాసంలో పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకుని దాడులుచేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. అందులో మాజీ వార్డుమెంబర్‌తోపాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.1,50,575 నగదు. 2 కార్లు, 11 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాలను విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

పీర్జాదిగూడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలను విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ గాయత్రినగర్‌లో వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడిని పట్టుకుని విచారించగా 10 గ్రాముల మత్తు పదార్థాలు దొరికాయి. రాజస్థాన్‌కు చెందిన దినేష్‌కుమార్ బిష్ణోయ్ అనే యువకుడు స్థానికంగా బోడుప్పల్ గాయత్రినగర్‌లో నివాసముంటున్నట్లు పోలీసులు గుర్తించారు.

దినేష్‌కుమార్ బిష్ణోయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.

అందరికీ సమాన హక్కులు

- జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ విజయ భారతి

కుషాయిగూడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అందరికీ సమాన హక్కులు అందేలా కృషి చేస్తున్నట్లు జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ విజయ భారతి పేర్కొన్నారు. శనివారం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కోర్టును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయ సహాయం అందినప్పుడే న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. కమిషన్ ఆధ్వర్యంలో ఇచ్చిన పలు కేసుల తీర్పుల గురించి ఆమె వివరించారు. కాగా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్‌లో తనకు జీవిత కాల సభ్యత్వం ఉందని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ అధికారులు, పలువురు న్యాయవాదులు, అసోసియేషన్ ప్రతినిధులు ఎం.అమరేందర్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ విజయ భారతిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి



కార్యక్రమంలో హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్, తదితరులు

కొత్త చట్టాలతో సత్వర న్యాయం

- హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మ

బంజారాహిల్స్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ నూతన చట్టాలు అభినందనీయమని హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహశర్మ అన్నారు. ఈ చట్టాల వల్ల బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉలూం లా కాలేజీలో శనివారం అన్‌లాకింగ్ 'కొత్త దిశలు, దేశం కొత్త క్రిమినల్ చట్టాలు' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు ఈ చట్టాల్లో ఎంతో ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఏళ్ల తరబడి కేసులు సాగకుండా ఉండేలా ప్రతీ కేసుకు ఒక నిర్దిష్ట సమయాన్ని ఏర్పాటు చేసే విధంగా రూపొందించారనన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టాలు ఎంతో పారదర్శకంగా సరళతరంగా ఉన్నాయన్నారు. ఇవి బాధితులకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు.కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమాచారి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నకిలీ బంగారు నాణాలను పరిశీలిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

నకిలీ బంగారం విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- రూ.28.5 లక్షల నగదు, నకిలీ బంగారు నాణేలు స్వాధీనం

జీడిమెట్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే మేలిమి బంగారమంటూ అమాయకులను మోసం చేస్తూ, నకిలీ బంగారం విక్రయించడానికి యత్నించిన ఓ ముఠా సభ్యులు ముగ్గురిని బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 28.5 లక్షల నగదు, 20 తులాల బరువు కలిగిన 100 నకిలీ బంగారు నాణేలు, 6 సెల్‌ఫోన్‌లు, కారు స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉప్పల్‌కు చెందిన యాషాల కామేశ్వరరావు అలియాస్ వల్లకంటి రాజు, అలియాస్ మహేష్, గుంటూరుకు చెందిన వేముల పుల్లారావు, పల్నాడుకు చెందిన బత్తుల సాంబశివరావులు ముఠాగా ఏర్పడి నకిలీ బంగారం విక్రయిస్తున్నారు. అంతేకాక దొంగనోట్లను కూడా చెలామణి చేస్తున్నారు. విజయవాడకు చెందిన మహేష్ అనే వ్యక్తి తక్కువ ధరకే బంగారం విక్రయిస్తున్నాడని వికారాబాద్ మండలం, తాండూరుకు చెందిన కె.అంజలికి అదే ప్రాంతానికి చెందిన సంధ్య తెలిపింది. అతడి ఫోన్ నెంబర్‌కు కూడా ఇచ్చింది. దీంతో అంజలి మహేష్‌కు ఫోన్‌చేసి బంగారం కావాలని అడగటంతో రూ.10 వేలకే తులం అమ్ముతామని చెప్పాడు. విజయవాడ రావాలని చెప్పడంతో తాను అంతదూరం రాలేనని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఈనెల 18న మహేష్ అంజలికి ఫోన్‌చేసి తనవద్ద అరకిలో బంగారు నాణేలు ఉన్నాయని మొత్తం కొనుగోలు చేస్తేనే ఇస్తానని చెప్పాడు. దీంతో ఆశపడిన అంజలి బానురేఖ, ప్రభావతిలకు కూడా చెప్పడంతో వారు కూడా కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారు. స్థానికంగా బంగారు పనులు చేసే ప్రవీణ్, బసవ అనే వ్యక్తులను తీసుకుని ఈనెల 19వ తేదీ సాయంత్రం 7 గంటలకు జీడిమెట్ల లోని శుభం హోటల్‌కు వచ్చారు. మహేష్ ఫోన్‌చేసి రూమ్‌నెంబర్ 306లో ఉన్నామని, మగవాళ్లను మాత్రమే పంపించమనడంతో నగదు ఇచ్చి ప్రవీణ్, బసవలను పంపించారు. ఆ తర్వాత ఆడవాళ్లు కూడా రావాలని అంజలికి మహేష్ మెసేజ్ పెట్టడంతో ముగ్గురు అక్కడికి వెళ్లారు. అప్పటికే పక్కా సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులు దాడులు నిర్వహించి ముఠాలోని ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేశారు. వారి నుంచి బంగారు నాణేలు, నగదు, స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో బాలానగర్ ఎస్ఓటీ డీసీపీ డీ.శ్రీనివాసులు, అడిషనల్ డీసీపీ పీ.శోభన్‌కుమార్, ఏసీపీ జీ.హన్మంతరావు, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

ఐదుగురు బైక్ దొంగల అరెస్ట్

- 13 లక్షల విలువ చేసే 25 బైక్‌లు స్వాధీనం

జీడిమెట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ఇంటి ముందు పార్కుచేసిన వాహనాలను దొంగిలించి విక్రయిస్తున్న ఓ ముఠాను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ముఠాలోని ఐదుగురు వ్యక్తులను అరెస్ట్‌చేశారు. వారి నుంచి 13 లక్షల రూపాయలు విలువ చేసే 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ వివలాలు శనివారం వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా, సింగూరుకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. విజయవాడలో ఉంటున్న ఇస్మాయిల్ కొంత కాలంగా జగద్గిరిగుట్ట చంద్రగిరినగర్‌కు చెందిన తమ సమీప బంధువు మహ్మద్‌కురేషిబాబా, మెదక్ పుల్కల్‌కు చెందిన సోహేల్‌తో కలిసి ఇళ్లముందు పార్కుచేసిన వాహనాలను దొంగిలించేవారు. ఆ బైక్‌లను సూర్యాపేటకు చెందిన మంగలిశ్యాం, కోదాడ నివాసి జోగిందర్ హుస్సేన్ వద్ద కుదువపెట్టి డబ్బులు తీసుకుని జల్సాలు చేస్తుంటారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో జీడిమెట్ల, సీసీఎస్ పోలీసులు ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి చోరీ చేసిన 36 బైక్‌లలో 25 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీపీ క్రైమ్స్ కె.నర్సింహ్మా, అడిషనల్ డీసీపీ పి.సత్యనారాయణ, సీసీఎస్ ఏసీపీ కళింగరావు, జీడిమెట్ల సీఐ జి.మల్లేష్ పాల్గొన్నారు.